క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ సైదారావు తెలియజేశారు. 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పిడుగురాళ్ల పట్టణ, 33/1 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో కొండమోడు, మహావీర్ నగర్, బైపాస్ న్యూ ఎస్ఎస్, జానపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రెంటచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలోని ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి శుక్రవారం తెలిపారు.

ఉపాధిహామీ కూలీ కుటుంబానికి పరిహారం అందజేత



దాచేపల్లి : మండలంలోని కొత్తూరుకి చెందిన మేదర ఏసయ్య కుటుంబ సభ్యులకు రూ.50 వేల నష్టపరిహారం శుక్రవారం అందజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీ పనులు చేస్తూ ఏసయ్య గుండెపోటులో ఇటీవల మృతిచెందారు. స్థానిక అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించటంతో రూ.50వేల పరిహారం మంజూరు చేసింది. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీవో శోభారాణి చేతుల మీదుగా పరిహారం చెక్‌ను ఏసయ్య కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కందుల జాను, సర్పంచ్ కోటమ్మ, ఏపీవో మల్లిఖార్జునరావు, స్థానికులు శ్రీనునాయక్, బొడ్డు నరసింహారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పేదలకు వరం

కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్

గురజాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిరుపేదలకు వరం లాంటిదని మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ సూచించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పనులను గుర్తించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంట పొలాల్లో పంట కాలువలు, పొలాల రహదారులు, శ్మశానాల అభివృద్ధి వంటి పనులకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో పద్మలత, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ సెక్రటరీ లక్ష్మా నాయక్, చలవాది నారాయణ తదితరులున్నారు.

అక్రమ మద్యం కలిగి ఉంటే చర్యలు తప్పవు

సెబ్ ఎస్ఐ జయరాం

గురజాల : ఎవరైనా అక్రమ మద్యం కలిగి ఉంటే వారిపై చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఎస్ఐ జయరాం హెచ్చరించారు. స్థానిక సెబ్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దాచేపల్లి మండలంలోని భట్రుపాలెం గ్రామానికి చెందిన భూక్యా బాలాజీ నాయక్ వద్ద 75 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. 75 మద్యం బాటిళ్లతో పాటు ఒక ద్విచక్ర వాహనం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పత్తిలో యాజమాన్య పద్ధతి పాటించాలి

పిడుగురాళ్ల: యాజమాన్య పద్ధతి ద్వారా పత్తి పంటను సాగు చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గా ప్రసాద్ తెలిపారు. పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలలో పత్తి పంటను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్, నూజివీడు సీడ్స్ సంయుక్తంగా పత్తి పంటలో సాంద్రత పద్ధతిలో సాగు చేపట్టడం అంశంపై పరిశీలన కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పత్తి పంటను సంప్రదాయ, యాజమాన్య పద్ధతి ద్వారా సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చునని తెలిపారు. గులాబి రంగు పురుగు తక్కువగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. షబా, ఉషా, పీవీరెడ్డి, నూజివీడు సీడ్స్ ఏజీఎం పి.నరసింహారెడ్డి, మురళీమోహన్, ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయులు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు శిక్షణ

క్రోసూరు: సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సాఫ్ట్ బాల్ కోచింగ్ క్యాంపులో అంతర్జాతీయ సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి వంటిపులి యమాని కోచింగ్ ఇవ్వనున్నట్లు పాఠశాల ప్రిన్స్‌పల్ సిస్టర్ మేరీ రజిత శుక్రవారం తెలిపారు. తమ పాఠశాల నుంచి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో సర్పంచ్ మీరావత్ నల్లబాలునాయక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి డీడీవో, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామంలో ఇంటింటిని జల్లెడపట్టి ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను సందర్శించారు. సర్పంచ్ మీరావత్ నల్లబాలునాయక్, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఎంపీటీసీలు సైదా, షేక్ సుభాన్ బీ, కార్యదర్శి జె.వెంకటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పోట్ల ముత్తయ్య, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

మాచవరం: ప్రజల ఆరోగ్యమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య అన్నారు. మండలంలోని పిన్నెల్లి–1 గ్రామ సచివాలయ పరిధిలో యూపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు చెప్పారు. శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. కాగా 402 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.ఎస్.చక్రవర్తి, డాక్టర్ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యు.వరప్రసాద్, ఈఓఆర్‌డీ వెంగళరావు, వైస్ ఎంపీపీ నన్నే, గ్రామ పెద్దలు షైదా, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పోషకాహార ప్రదర్శన

వైద్య రంగంలో నవశకానికి నాంది

ఓబులేశునిపల్లె (దుర్గి): పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వైద్య రంగంలో నవశకానికి నాంది పలికిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎంపీపీ ఏచూరి సాయిశంకర్ అన్నారు. శుక్రవారం ఓబులేశునిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ చేపడుతున్న చర్యలు అమోఘమన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో పూర్తిస్థాయిలో వైద్యులు, ల్యాబ్‌లు మందులు, వైద్య సిబ్బందిని నియమించిన ఘనత ఆయనదేనన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెనుకబడిన పల్నాటి ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ వహించి నియోజకవర్గ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బందిని నియమించారన్నారు. తహసీల్దార్ జి.రమేష్ కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి, సర్పంచ్ ఉన్నం వెంకటేశ్వర్లు, ముటుకూరు సర్పంచ్ గొంది నాసరయ్య, వైద్యులు సైదులు, సతీష్, వీఆర్‌ఓ సునీత, సెక్రటరీ వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులున్నారు.



ఓబులేశునిపల్లెలో బీపీ చెక్ చేస్తున్న వైద్యులు

షాదీఖానా పనుల పరిశీలన

దాచేపల్లి : నగర పంచాయతీలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న షాదీఖానా పనులను శుక్రవారం గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ ఎమ్మెల్యే కాసుకి వివరించారు. షాదీఖానా పనులు త్వరితగతిన జరగటం పట్ల ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేసి కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ దాచేపల్లిలో షాదీఖానా నిర్మిస్తామని గత ప్రభుత్వంలో ముస్లిం, మైనార్టీలకు హామీ ఇచ్చి విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత షాదీఖానా నిర్మించాలని ముస్లిం సోదరులు తనను కలిసి అడిగారని వారు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న షాదీఖానా నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి కోటిరూపాయల నిధులు మంజూరు చేయించామని ఆయన చెప్పారు. పల్నాడు ప్రాంతంలోనే ఈ షాదీఖానా ప్రత్యేకంగా నిర్మిస్తున్నామని, షాదీఖానాలో ఏసీ సౌకర్యం కూడా కలిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే కాసు వెంట పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా, మండల కన్వీనర్ కోట కృష్ణ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



షాదీఖానా పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలుకుతూ ప్రతిజ్ఞ

బ్రహ్మనాయుడు జెడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయుల ఆదర్శం

కారెంపూడి: పర్యావరణానికి హాని చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులను ఇకపై వాడబోమని స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి) పాఠశాలకు వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న హానిని విద్యార్థులు ఉపాధ్యాయుల సమావేశంలో వివరించారు. పర్యావరణానికి జరుగుతున్న నష్టంపై విద్యావంతులు చైతన్యవంతులై ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తే ఆ ప్రభావంతో క్రమేణా అందరూ ప్లాస్టిక్ వాడకాలకు స్వస్తి పలుకుతారని జాజి వివరించారు. ఎక్కడ చూచినా ప్లాస్టిక్ వ్యర్థాలు కన్పిస్తున్నాయని, చివరకు నల్లమల అడవులలో సైతం కన్పిస్తున్నాయని తన వంతుగా వాటిని ఏరివేస్తూ అలా వ్యర్థాలు వేసే వారిలో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నానన్నారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన నాగులేరు వాగును కూడా కాలుష్యం కాటేస్తోందని అన్నారు. దానికి స్పందించిన హెచ్ఎం అనంతశివ, ఉపాధ్యాయులు ఇప్పటికే సాధ్యమైనంత పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను వాడకూడదని నిర్ణయించుకుని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలను వివరిస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ విడుదల చేసిన కర పత్రాలను వారు ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణకు, గ్రామాల స్వచ్ఛతకు ప్లాస్టిక్ వాడకాన్ని మాని వేయాలని హెచ్ఎం అనంత శివ, జాజి సూచించారు.



పౌర సేవలకు ముస్తాబైన సచివాలయాలు, ఆర్బీకేలు

మండల పరిధిలో సిద్ధమైన ఐదు సచివాలయాలు, ఆరు ఆర్బీకేలు

దుర్గి: ప్రజా సేవే పరమార్థంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామాలలో నూతన ఒరవడిని సృష్టిస్తుంది. ఆయా గ్రామాలలో కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోని దుర్భర పరిస్థితుల చేపట్టిన నిర్మాణాలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో మండలంలో అభివృద్ధి పనులకు ప్రత్యేక శ్రద్ధ వహించి అధికారులకు సూచనలు చేస్తూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా ''సాక్షితో'' మాట్లాడుతూ సీఎం జగన్ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు, పౌర సేవలు అన్నీ ఇంటివద్దకే చేరేలా నూతన అధ్యాయానికి నాంది పలికారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన సచివాలయాలు : దుర్గి– 1, పోలేపల్లి, ఓబులేశునిపల్లె, కంచరగుంట, కోలగుట్ల, భవనాలకు రూ.40 లక్షల చొప్పున రూ.2 కోట్లు నిధులతో నిర్మాణం పూర్తయింది.

రైతు భరోసా కేంద్రాలు : దుర్గి– 1, పోలేపల్లి, ఓబులేశునిపల్లె, కంచరగుంట, కోలగుట్ల, ఆత్మకూరు భవనాలకు రూ.21.80 లక్షల చొప్పున రూ.1.31కోట్ల నిధులతో నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇవి ప్రారంభమైతే అద్దె భవనాల నుంచి సొంత భవనాలలో సేవలందించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దుర్గి సచివాలయం 1



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దుర్గి ఆర్బీకే

దసరా పండగ నాటికి ప్రజలకు అందుబాటులోకి ..



మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అడిగొప్పలలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. చిన్నపాటి పనులను దసరా పండుగ లోపు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నాం.

ఎస్.వెలుగొండారెడ్డి పంచాయితీ రాజ్ ఏఈ

ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

విజయపురిసౌత్: పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పకుండా ఈ–కేవైసీ చేయించుకోవాలని మాచర్ల మండల వ్యవసాయాధికారి కె.లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మాచర్ల మండలంలోని చింతలతండా గ్రామంలో ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించి మాట్లాడారు. పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకొని, ఈ–కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ–కేవైసీ చేయించుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వ రాయితీలకు అర్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎస్‌కే జాస్మిన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మాచర్ల మండల వ్యవసాయాధికారి లక్ష్మారెడ్డి

ఈ పంట నమోదు తప్పనిసరి

దాచేపల్లి : రైతులు ఈ పంట నమోదు చేయాలని ఏవో డి.పాపకుమారి అన్నారు. మండలంలోని తంగెడ, ముత్యాలంపాడులో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ పంట, ఈ కేవైసీ చేయించటం వలన ప్రభుత్వం నుంచి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వం నుంచి రాయతీలు, విత్తనాలు, పంటనష్ట పరిహారం అందుతుందని ఆమె చెప్పారు.

ఈ కేవైసీపై రైతులకు అవగాహన

దుర్గి: రైతులు తమ సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ కేవైసీని పూర్తి చేసుకోవాలని మండల రైతాంగాన్ని వ్యవసాయాధికారి అమీర్‌రెడ్డి కోరారు. ఈ కేవైసీపై స్థానిక రైతులను స్వయంగా కలిసి అవగాహన కల్పించారు. గత కొన్ని రోజులుగా అన్ని ఆర్బీకేలలో చేస్తున్నారన్నారు. ఆదివారం కూడా పనిచేస్తాయన్నారు. జిల్లాలోనే అత్యధికంగా మండల పరిధిలో పంట సాగు విస్తీర్ణం చేపట్టారన్నారు. వర్షాలు సకాలంలో పడినప్పటికి గడిచిన నెల రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. పంట బీమాకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందన్నారు. నష్టం జరిగితే రైతులను సబ్సిడీ రూపంలో ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.



ఏఓ అమీర్‌రెడ్డి

వడ్డే ఓబన్న ఆశయాలను సాధిద్దాం

పిడుగురాళ్ల: వడ్డె ఓబన్న ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా పట్టణంలోని హైస్కూల్ ఎదురుగా ఉన్న వడ్డె ఓబన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరల కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి వడ్డె ఓబన్న అన్నారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అన్ని విధాలుగా సహాయం చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, 16వ వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్లా గురుస్వామి, చల్లా ఆవులయ్య, వేముల సాంబయ్య, మల్లెల వెంకటేశ్వర్లు, వేముల బాబురావు, కె.బాలస్వామి, టి.వెంకటేశ్వర్లు, కె.తిరుపతయ్య, జి.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న విగ్రహం వద్ద మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వే స్టేషన్ సమస్యలను పరిష్కరించాలి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వే సమస్యల పరిష్కారంపై 75వ జెడ్ఆర్‌సీసీ సర్వసభ్య సమావేశంలో చర్చించినట్లు జెడ్ఆర్‌సీసీ కమిటీ సభ్యులు మద్దాలి సుబ్బయ్య తెలిపారు. పట్టణంలో తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన సికింద్రాబాద్‌లో జెడ్ఆర్‌సీసీ సర్వసభ్య సమావేశం జరిగిందని, తాను పల్నాడు ప్రాంతంలోని పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ సమస్యలను పరిష్కరించాలని తెలిపినట్లు పేర్కొన్నారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ నుంచి రాత్రి సమయాల్లో వెళ్లే రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందించటం జరిగిందని పేర్కొన్నారు. పిడుగురాళ్ల స్టేషన్ నుంచి వెళ్లే కొన్ని రైళ్లు ఆగకుండా వెళ్తున్నాయని వాటికి పిడుగురాళ్లలో స్టాపింగ్ కల్పించాలని కోరానన్నారు. కోవిడ్ నుంచి పిడుగురాళ్ల స్టేషన్‌లో రాత్రి పూట రైళ్లకు స్టాపింగ్ ఎత్తి వేశారని, ఇప్పుడు తిరిగి స్టాపింగ్ ఇవ్వాలని, రైల్వే పార్శిల్ బుకింగ్‌ను కూడా మళ్లీ ప్రారంభించాలని కోరారు.

జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైన గుత్తికొండ విద్యార్థి

పిడుగురాళ్లరూరల్: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్లలో నిర్వహించిన అండర్ 17 బాలుర విభాగంలో గుత్తికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి దోసపాటి అనిల్ ఎంపికయ్యారు. గురజాల నియోజకవర్గం నుంచి వెళ్లిన జట్టు నుంచి అనిల్ ఉమ్మడి గుటూరు జిల్లా జట్టులో స్థానం సాధించాడు. కడపలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అనిల్ జిల్లా జట్టుకు ఆడనున్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన అనిల్‌ను గుత్తికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మల, పీడీ కె.నాగభూషణం, పీఈటీ సాతులూరి సురేంద్ర, గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.



విద్యార్థి అనిల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తహసీల్దార్‌కు సన్మానం



కారెంపూడి: రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కారెంపూడి తహసీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్‌ను శుక్రవారం రాత్రి రెవెన్యూ అధికారులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సహాయకులు, కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ శ్రీనివాస్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. డీటీ కీర్తిసుధా స్రవంతి అన్ని విభాగాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు

కమిషనర్ ఈవీ రమణబాబు

మాచర్ల: పురపాలక సంఘ అభివృద్ధికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయటం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగనన్న కాలనీలకు ఆర్చిల ఏర్పాటు నిమిత్తం 16 లే అవుట్లకు కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగిందన్నారు. అదే విధంగా నూతనంగా పైప్‌లైన్ నిర్మాణానికి రూ.కోటితో పనులు కొనసాగుతున్నాయన్నారు. అన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక చర్యలు తీసుకోవటం వలన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కమిషనర్ ఈవీ రమణబాబు అన్నారు. రాబోయే రోజుల్లో ఎవరూ ఇబ్బంది పడకుండా మున్సిపల్ కౌన్సిల్ వారి సహకారంతో ప్రత్యేకంగా చర్యలు తీసుకొని మాచర్ల మున్సిపాలిటీని ఉత్తమ స్థాయిలో నిలిపేందుకు అందరూ సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

ఉపాధి హామీ పథకంలో 96 పనులు

అచ్చంపేట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వలసల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో 96 రకాల పనులు చేసుకునే అవకాశాన్ని కల్పించినట్లు ఉపాధి హామీ పథకం జేఈ బి.రమణమూర్తి చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో గ్రామస్తులకు పలు రకాల పనులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. వాటిని వినియోగించుకోవాలన్నారు. ఏపీవో నాగ శ్రీనివాస్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో ఏ విధమైన పనులు చేపట్టాలి, వాటిని ఏ విధంగా ఎంపిక చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ జేఈ రమణమూర్తి

రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

బెల్లంకొండ: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన భూముల రీ–సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాచాయపాలెం గ్రామంలో రీ– సర్వేపై రెవెన్యూ సిబ్బంది సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వన్నాయపాలెం, పాపాయపాలెం, మాచాయపాలెం గ్రామాలకు ఓఆర్ఐ మ్యాప్ రావడం జరిగిందన్నారు. కొద్ది రోజులలో ఈ మూడు గ్రామాలలో ముందుగా రీ సర్వే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రీ సర్వేపై ముందుగా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి, రైతులను సంసిద్ధం చేయాలన్నారు. ఈ రీ–సర్వేలో భూ సరిహద్దు, హక్కు పత్రాలు ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. మాచాయపాలెం గ్రామంలో పలువురు రైతుల భూములను పరిశీలించి, రెవెన్యూ సిబ్బందికి జేసీ శ్యామ్ ప్రసాద్ పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దారు నిర్మల, మండల సర్వేయర్ వీరయ్య, వివిధ గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రీ-సర్వే ప్రక్రియ పరిశీలన

సత్తెనపల్లి: జగనన్న భూసర్వే–భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాదు శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే వెక్టరైజేషన్ పై జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ సురేష్‌నాయక్, సర్వేయర్, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.



రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జేసీ శ్యామ్ ప్రసాద్

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



ముప్పాళ్ల: స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడా ఎంపికలు శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పోటీలలో భాగంగా అండర్–17 బాలుర కబడ్డీలో మాదల జెడ్పీ హైస్కూల్ ప్రథమం, ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్ ద్వితీయం, ఖోఖో, టెన్నికాయిట్‌లో నార్నెపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అలాగే అండర్–17 బాలికల కబడ్డీలో మాదల జెడ్పీ హైస్కూల్, ఖోఖోలో ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్, త్రోబాల్, బాల్ బాడ్మింటన్ మాదల జెడ్పీ హైస్కూల్, టెన్నికాయిట్ బొల్లవరం జెడ్పీ హైస్కూల్ జట్టు విజయాలు సాధించాయి. బాలుర అండర్–14 వాలీబాల్, కబడ్డీ పోటీలలో ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్, టెన్నికాయిట్. ఖోఖోలో నార్నెపాడు గెలుపొందాయి. అండర్–14 బాలికల త్రోబాల్, బాల్ బాడ్మింటన్‌లో మాదల, టెన్నికాయిట్‌లో నార్నెపాడు జట్లు విజయం సాధించాయి. అలాగే అథ్లెటిక్స్‌లో ఎంపికలు నిర్వహించారు.